సాక్షి జోగులాంబ గద్వాల

గురువారం । 16 । అక్టోబర్ । 2025



నల్లమలలో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రధాని మోదీ గురువారం శ్రీశైలం వస్తున్నం దున నల్లమలలో పోలీసులు బుధవారం నుంచే ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు.

-10లో ▸



ఉల్లి క్వింటా రూ.1,900

దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధర క్వింటా గరిష్టంగా రూ.1,900 పలికింది.

-10లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /22.3

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతగా విధులు నిర్వహించాలి



అయిజ: పోలీసులు బాధ్యతతో విధులు నిర్వహించాలని ఎస్పీ టి. శ్రీనివాసరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఎస్పీ అయిజ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది యూనిఫామ్ టర్న్ ఔట్, స్టేషన్ రికార్డ్స్, పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని, సరిహద్దుల్లో ఎలాంటి అక్రమ రవాణాకు అవకాశం ఉండకూడదని అన్నారు. గ్రామాల్లో వీపీఓలు గ్రామాల్లో ఎలాంటి సమాచారమైన తెలుసుకొని ఉండాలని, ఫిర్యాదులపై పాటిటివ్ స్పందనే పోలీసుల పనితీరును తెలియజేస్తుందని అన్నారు. ఈసందర్భంగా ఎస్పీ చేతుల మీదుగా ప్రజలు పోగొట్టుకున్న 10 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. శంకర్, డీఎస్పీ మొగలయ్య, శాంతినగర్ సీఐ టాటా బాబు, ఎస్సైలు శ్రీనివాసరావు, తరుణ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



గద్వాలటౌన్: పర్యావరణ వ్యవస్థలో సమస్త జీవరాశులు మనుగడ సాగిస్తున్నాయని, అటువంటి పర్యావరణాన్ని కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ షేక్ కలందర్ బాషా అన్నారు. పర్యావరణ, అడవులు, వాతావరణ కేంద్ర మంత్రిత్వశాఖ, తెలంగాణ ఎస్‌జీసీ ఆదేశాల మేరకు బుధవారం కళాశాలలో 'ఎకో బజార్'ను ఏర్పాటు చేశారు. కళాశాలలోని ఇకో క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇకో బజార్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు పర్యావరణహిత వస్తువుల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు చేతితో తయారు చేసిన జూట్ బ్యాగులు, పేపర్స్‌తో తయారు చేసిన వస్తువులు, విల్లెట్స్‌తో చేసిన తిను బండారాలు, వెదురు చేసిన వస్తువులను ప్రదర్శించడం జరిగింది. ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు స్టాల్స్‌ను తిలకించి, వాటిని ఏవిధంగా తయారు చేశారనే వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. ప్లాస్టిక్ భూతం నుంచి మన ధరిత్రిని రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ కమిటీ కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్ చంద్రమోహన్, సభ్యులు పద్మా, గణేష్, కృష్ణయ్య, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

చెరుకు సాగుతో అధిక లాభాలు



ఎర్రవల్లి: రైతులు చెరుకు సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని కృష్ణవేణి చెరుకు పరిశ్రమ సలహాదారుడు రాంమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సాసనూలులో యూపీఎల్ ఆధ్వర్యంలో రైతులకు చెరుకు పంట సాగుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చెరుకు సాగు ప్రాధాన్యత, సాగులో తీసుకోవాల్సిన మెళకువలు, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు చెరుకు సాగు కోసం ముందస్తుగా నీటి లభ్యతతో పాటు సరైన స్వభావం గల నేలలను, తెగుళ్లను తట్టుకొని అధిక దిగుబడిని ఇచ్చే కొత్త రకాలను ఎంచుకోవాలన్నారు. సాగులో బిందుసేద్యం వినియోగించడం వల్ల నీటి వినియోగం తగ్గడంతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందన్నారు. ముఖ్యంగా అంతర కృషి ద్వారా కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. నేలను సారవంతం చేసి భూమిలో కర్బన శాతాన్ని పెంచడం కోసం రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకొని పిఎస్‌బి, కెఎస్‌బి వంటి బ్యాక్టీరియాలను వినియోగించుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి 7–10 రోజుల వ్యవధిలో తప్పకుండా నీటి తడులను పెట్టుకోవాలన్నారు. చెరుకు చెత్తను మల్చ్‌గా వినియోగించడం వల్ల నేలలో తేమ నిలిచి ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చునన్నారు.

ఢీఎంఎఫ్‌టీ..!

జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ తీరుపై రగడ



- పనులు, ప్రాంతాల ఎంపిక, నిధుల కేటాయింపుపై వివాదం
- తనకు తెలియకుండానే చేయడంపై అలంపూర్‌శాసనసభ్యుడి అసంతృప్తి
- జోగులాంబ గద్వాల జిల్లాలో చర్చనీయాంశంగా మారిన లేఖ
- నియోజకవర్గ నేత 'హస్తమే' కారణమంటూ ఊహాగానాలు
- కమీషన్లే కారణమని విమర్శలు..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జోగుళాంబ గద్వాల జిల్లాలో జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ)కు సంబంధించి చెలరేగిన వివాదం ఉమ్మడి పాలమూరువ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. పలు అభివృద్ధి పనులు, ప్రాంతాల ఎంపిక, నిధుల కేటాయింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడి లేఖ ఆలస్యంగా వెలుగు చూడగా.. చర్చనీయాంశమైంది. నియోజకవర్గ శాసనసభ్యుడిగా, డీఎంఎఫ్‌టీ సభ్యుడిగా ఉన్న తనకు సమావేశంపై సమాచారం ఇవ్వలేదు.. మీటింగ్ మినిట్స్ కూడా అందజేయలేదని అందులో పేర్కొనగా.. రగడ రాజుకుంది.

నిబంధనలకు విరుద్ధంగా..

జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్‌లో చైర్మన్/చైర్‌పర్సన్‌గా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సెక్రటరీగా జిల్లా కలెక్టర్, కన్వీనర్‌గా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీఓ), కోశాధికారిగా జిల్లా గ్రామీణా భివృద్ధి అధికారి ఉంటారు. వీరితో పాటు ఆయా జిల్లాల్లోని లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, జెడ్పీ చైర్మన్లు/జెడ్పీ చైర్‌పర్సన్లు, ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించి సమావేశం నిర్వహించి.. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ప్రతిపాదనల ప్రకారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదేశాలతో అధికారులు పనులు, ప్రాంతాల ఎంపిక, నిధుల కేటాయింపు చేపట్టాలి. కానీ.. గద్వాల జిల్లాలో ఇలా జరగలేదని కలెక్టర్ బీఎం సంతోష్‌కు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు రాసిన లేఖ ద్వారా స్పష్టమవుతోంది.

కమీషన్లే కారణమంటూ..

తనకు తెలియకుండా కేటాయించిన 13 రకాల అభివృద్ధి పనులను రద్దు చేయాలంటూ కలెక్టర్‌కు ఎమ్మెల్యే రాసిన లేఖ వెలుగుచూసిన నేపథ్యంలో ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలో అధికార పార్టీ కాంగ్రెస్‌కు చెందిన ముఖ్య నేత జోక్యంతోనే అధికారులు ఆయా మండలాల్లో ఏకపక్షంగా అభివృద్ధి పనులు కేటాయించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా పనుల్లో ఒక్కోదానికి సుమారు 20 శాతం మేర కమీషన్లు అందేలా సదరు నాయకుడు చక్రం తిప్పినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

అధికారుల్లో అలజడి..

అధికార, ప్రతిపక్ష నాయకులు.. స్వపక్షంలోనే విపక్ష నేతల మధ్య రాజకీయ వైరం జోగుళాంబ గద్వాల జిల్లాలో అధికార యంత్రాంగం వైపు మళ్లడం ప్రభుత్వ ఉద్యోగుల్లో అలజడి రేపుతోంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదేశాలు లేకుండా డీఎంఎఫ్‌టీ పనుల కేటాయింపులు జరిగే అవకాశం లేదని.. అనవసరంగా ఈ వివాదంలో తమను లాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో డీఎంఎఫ్‌టీ పనుల కేటాయింపులు, ఎమ్మెల్యే లేఖ నేపథ్యంలో వివాదంపై అధికారులను ఫోన్‌లో సంప్రదించేందుకు 'సాక్షి' ప్రయత్నించగా.. ఎవరూ అందుబాటులోకి రాలేదు.

ఆధిపత్యమే హద్దుగా..

ఉమ్మడి పాలమూరులోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12 మంది కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు మాత్రమే బీఆర్‌ఎస్‌కు చెందిన వారు. ఈ క్రమంలో అలంపూర్‌లో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఆధిపత్య పోరు తీవ్రరూపం దాల్చింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కాకుండా ఆ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకుడు అన్నీ తానై నడిపిస్తున్నట్లు సమాచారం. దీంతో నియోజకవర్గ పరిధిలో దాదాపుగా అన్ని మండలాల్లో ఎమ్మెల్యే ప్రమేయం లేకుండా పనుల కేటాయింపు జరిగినట్లు తెలుస్తోంది.

గద్వాలలో కొన్ని మండలాల్లో..

గద్వాల నియోజకవర్గంలో మాత్రం భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత మధ్య తొలి నుంచీ విభేదాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ టికెట్ రాకపోవడంతో సరిత కాంగ్రెస్‌లో చేరి హస్తం గుర్తుపై పోటీ చేసింది. బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన బండ్ల ఆమెపై గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం ఆ ఇద్దరు, వారి వారి వర్గాల మధ్య పచ్చగడ్డి వేసినా భగ్గుమనేలా వైరం కొనసాగుతోంది. ఈ క్రమంలో సరిత నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి.. కృష్ణమోహన్‌రెడ్డి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వర్గంగా ముద్ర పడ్డారు. ఈ క్రమంలో తెరపైకి వచ్చిన అలంపూర్ ఎపిసోడ్‌తో గద్వాల సెగ్మెంట్‌లోని కొన్ని మండలాల్లో ముఖ్య నాయకుడి ప్రమేయం లేకుండానే డీఎంఎఫ్‌టీ పనుల కేటాయింపులు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

మీ త్యాగం మరువలేనిది



ర్యాలంపాడు పునరావాస కేంద్రంలో లే అవుట్ మ్యాప్‌ను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్, పక్కన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- ర్యాలంపాడు పునరావాస కేంద్రం సందర్శన
- వసతుల కల్పన.. సమస్యలు పరిష్కరిస్తామని హామీ

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి విలువైన భూములు, ఇండ్లను త్యాగం చేసిన ర్యాలంపాడు గ్రామస్తుల త్యాగం మరువలేనిదని కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు ర్యాలంపాడు పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్ర లే అవుట్, మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పునరావస కేంద్రంలో అన్ని వసతులతో కూడిన వసతులు కల్పించేందకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ర్యాలంపాడు గ్రామస్తులందరూ ఇక్కడే ఇళ్లు నిర్మంచుకొని జీవనం కొనసాగించాలని సూచించారు. ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. గద్వాల అభివృద్ధిలో కీలక పాత్ర పోశించిన ర్యాలంపాడు గ్రామస్తుల త్యాగం ఎనలేనిదన్నారు. అతి తక్కువ ధరకే భూములు, ఇండ్లు ఇచ్చారన్నారు. అదే ప్రాంతంలోనే ప్రాజెక్టు రిజర్వాయర్, పంప్‌హౌస్, కాల్వలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది

కలెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ.. జిల్లాలో లక్షా 80వేల ఎకరాలకు సాగు నీరందించే ఈ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం పూర్తి బాధ్యతతో అండగా ఉంటుందన్నారు. ర్యాలంపాడులో 4 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించడం జరిగిందన్నారు. ఈ జలాలతోనే జిల్లా సస్య శ్యామలం అయ్యిందన్నారు. అన్ని వసతులతో కూడిన పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ అభివృద్ధికి గాను పునరావాస సెంటర్‌లో రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాలలు, అంగన్‌వాడీ భవనం, దేవాలయాలు, చర్చిలు వంటి మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. బాధితులకు అందాల్సిన ఫిట్టింగ్ చార్జెస్‌ను కూడా త్వరలోనే అందేవిధంగా చూస్తామన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా 250 ఇళ్లను ఇక్కడ మంజూరయ్యాయని, లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీరాయణ, ఆర్డీఓ అలివేలు, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాసులు, నాయకులు రాజశేఖర్, విజయ్ కుమార్, పురుషోత్తం రెడ్డి, దైలన్న, హంపన్న పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

గద్వాలటౌన్: విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. బుధవారం స్థానిక బుర్దపేట ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల చేత ఇంగ్లీష్ పాఠాలు చదివించారు. టీచర్లు బాగా చెబుతున్నారా అని అడిగి సమాధానాలు రాబట్టారు. బాగా చదువుకోవాలని విద్యార్థినులకు సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిని, విద్యార్థుల ఫెషియల్ రికగ్నిషన్‌ను పరిశీలించారు. యూడైస్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. పాఠశాలలోని వంటగది, త్రాగునీరు, భోజనం నాణ్యత, స్టోర్ రూంలోని సరుకులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు మెనూ ప్రకారం ప్రతిరోజు పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. ఆహార పదార్థాలు, కూరగాయలు నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. వంట పాత్రలతోపాటు వంటగది ఎల్లప్పుడు శుభ్రంగా ఉండాలన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలకు రూ.180 కోట్ల బకాయి పెండింగ్‌లో ఉందని, దీంతో ఈ స్కీం కింద విద్యను అభ్యసిస్తున్న దాదాపు 30 వేల మంది దళిత గిరిజన విద్యార్థులు రోడ్డున పడ్డారని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి, ప్రధాన కార్యదర్శి రాజులు ఎమ్మెల్యే విజయుడును కోరారు. కర్నూల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజయుడును బుధవారం కలిసి పెండింగ్ నిధులు తక్షణమే చెల్లించాలని, విద్యార్థులు రోడ్డున పడుతున్నారనివినతి పత్రం అందజేశారు. ప్రభుత్వంతో, ఇంచార్జీ మంత్రితో మాట్లాడి బకాయి నిధులు వచ్చే విధంగా కృషి చేయాలని విజయ్, వెంకటస్వామి, ప్రభాకర్ కోరారు.



ఎమ్మెల్యే విజయుడుకి వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

ప్రజా సమస్యలను పరిష్కరించండి

గద్వాల: జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాసమస్యలపై సర్వే చేసిన సందర్భంగా వచ్చిన సమస్యలను పరిష్కరించాలని బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని వివిధ వార్డులలో ఉన్నటు వంటి సమస్యలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నరసింహ,దేవదాను, నర్సింహులు,ఉన్నారు.

స్నాతకోత్సవానికి వేళాయె

నేడు పీయూకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాక

ఒకప్పుడు ఓయూ అనుబంధ పీజీ సెంటర్‌తో ప్రారంభమై.. అనంతరం యూనివర్సిటీగా ఏర్పడి.. సకల సౌకర్యాలు కల్పించడంతో పాటు పరిశోధనలకు ఊతమిస్తూ.. వేలాది మంది విద్యార్థుల ఉన్నత విద్యకు బాటలు వేసింది పాలమూరు యూనివర్సిటీ. మొదట సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలతో ప్రారంభమైనా క్రమంగా ఉపాధి, ఉద్యోగ కోర్సులైన ఇంజినీరింగ్, లా కళాశాలల ఏర్పాటుతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. తాజాగా పీయూ పరిధిలో 160 కళాశాలలు ఉండగా.. 42,554 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఈక్రమంలో గురువారం జరిగే నాలుగో స్నాతకోత్సవానికి పీయూ ముస్తాబైంది.





పీయూ అడ్మినిస్ట్రేషన్ భవనం

- నాలుగోసారి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ఎంఎస్‌ఎన్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్..
- 83 మంది విద్యార్థులకు బంగారు పతకాలు.. 12 మందికి పీహెచ్‌డీ పట్టాల ప్రదానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ (పీయూ) నాలుగో స్నాతకోత్సవానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం జరిగే కార్యక్రమానికి పీయూలోని లైబ్రరీ ఆడిటోరియం వేదిక కానుంది. ముఖ్య అతిథిగా గవర్నర్, యూనివర్సిటీ చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నారు. మొదటగా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్‌తో సమావేశం.. ఆ తర్వాత స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్, వివిధ డిపార్ట్‌మెంట్ల డీన్స్, గోల్డ్‌మెడల్స్ తీసుకునే విద్యార్థులు, పీహెచ్‌డీ పట్టాలు అందుకునే స్కాలర్స్, వారి తల్లిదండ్రులు పాల్గొననున్నారు. పీయూ చరిత్రలో మొదటిసారిగా సామాజిక విభాగంలో విశిష్ట సేవలందిస్తున్న ఎంఎస్‌ఎన్ అధినేత, పారిశ్రామికవేత్త మన్నె సత్యనారాయణరెడ్డికి గౌరవ డాక్టరేట్‌ను అందజేయనున్నారు.

అంచెలంచెలుగా ఎదుగుతూ..

పీయూ అంచెలంచెలుగా ఎదుగుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఎంతో కృషి చేస్తుంది. కేవలం ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధ పీజీ సెంటర్‌తో ప్రారంభమై.. 2008లో పూర్తిస్థాయి యూనివర్సిటీగా ఏర్పడింది. ప్రారంభంలో అడ్మినిస్ట్రేషన్ పరమైన అంశాలన్ని కూడా పీయూలో ప్రస్తుతం ఉన్న పీజీ కళాశాలలో జరిగేవి. 2010–11లో అడ్మినిస్ట్రేషన్ భవనం నిర్మించిన తర్వాత అక్కడికి బదిలీ చేశారు. 2018–19 ఎగ్జిమినేషన్ బ్రాంచ్‌ను రూ.10 కోట్లతో నిర్మించడంతో అక్కడికి ప్రత్యేకంగా బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు. పీయూ రక్షణ కోసం 3.1 ఎకరాల పొడువు గోడను 2020లో అధికారులు నిర్మించారు. సువిశాల పీయూ క్యాంపస్, కార్యాలయాలు, హాస్టళ్లు, కళాశాలల పర్యవేక్షణ కోసం 152 సీసీ కెమెరాలతో 24 గంటలు పర్యవేక్షణ చేస్తున్నారు.

ఉన్నత విద్య చేరువ..

గద్వాల, వనపర్తి, కొల్లాపూర్‌లో పీజీ సెంటర్లు ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థులకు పీజీ స్థాయి విద్యను అందిస్తుంది. ఇందులో ప్రస్తుతం ప్రొఫెషనల్, ట్రెడిషనల్ కోర్సులు కలిపి 19 కోర్సులకు తోడుగా ఇంజినీరింగ్, లా కళాశాలలు కూడా ప్రారంభం కావడంతో దీని ప్రాధాన్యత మరింత పెరిగింది. ప్రస్తుతం పీయూలో మొత్తం రెండు బాలుర హాస్టల్స్, రెండు బాలికల హాస్టల్స్ ఉండగా ఇందులో 1320 మంది విద్యార్థులు ఉంటున్నారు.

కీలక ఘట్టాలు

- ⇨ 2009లో పీయూలో ఫార్మసీ కళాశాలను ఏర్పాటు చేసి బీఫార్మా కోర్సును అందిస్తున్నారు. 230 మందితో కొనసాగుతున్న కళాశాల 2014లో యూజీసీ నుంచి 12బీ గుర్తింపు పొందింది. బీ ఫార్మాలో 240, ఎం ఫార్మాలో 28 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.
- ⇨ 2009లో ఫార్మసీ కళాశాలకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి 2ఎఫ్ గుర్తింపు వచ్చింది.
- ⇨ 2010లో పీయూలో ఎన్ఎస్ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీం)కు కేంద్ర ప్రభుత్వం అనుమతి రావడంతో మొత్తం 100పైగా యూనిట్లలో 4 వేల మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. క్యాంపుల నిమిత్తం ఒక్కో యూనిట్‌కు ఏడాదికి ప్రభుత్వం రూ.35వేలు కేటాయిస్తుంది.
- ⇨ 2014లో ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్) గుర్తింపు రాగా వీటి ద్వారా ఎంఈడీ, బీఈడీ కళాశాలలు నిర్వహించేందుకు అవకాశం లభించింది.
- ⇨ 2018లో రూసా (రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్) గుర్తింపు లభించింది.
- ⇨ 2019లో పీయూ న్యాక్ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్)కు దరఖాస్తు చేస్తే 2020లో న్యాక్ బీ గ్రేడ్ గుర్తింపు వచ్చింది. దీని ద్వారా పీయూకు రూసా నిధుల కింద ప్రతి ఐదేళ్లకు రూ.50 కోట్ల వరకు నిధులు వస్తున్నాయి.
- ⇨ 2020లో రూ.8.20 కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మించడంతో ఇక్కడ జాతీయ, అంతర్జాతీ స్థాయి క్రీడలు నిర్వహించేందుకు అవకాశం లభించింది.
- ⇨ 2023 నుంచి పీఎం ఉషా గుర్తింపు రావడంతో రూ.100 కోట్లు నిధులు విడుదలయ్యాయి.
- ⇨ 2024లో పీయూలో లా కళాశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి గుర్తింపు వచ్చింది. దీంతో పీయూలో ఈ విద్యాసంవత్సరం నుంచి ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం 120 సీట్లను భర్తీ చేస్తున్నారు.
- ⇨ 2025లో ప్రారంభమైన ఇంజినీరింగ్ కళాశాలకు సైతం ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నుంచి గుర్తింపు పొందేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

పీయూ పరిధిలో కళాశాలల వివరాలిలా..

కళాశాలలు	సంఖ్య	మొత్తం విద్యార్థులు
డిగ్రీ	93	33,000
లా	2	390
ఎంబీఏ	6	620
పీజీ	20	3,600
బీఈడీ	29	3,122
ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ	3	98
బీపెడ్	3	258
ఎంఈడీ	1	210
బీ, డీ, ఎం ఫార్మసీలు	3	1,023

ఏర్పాట్లు పూర్తి చేశాం..



స్నాతకోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గురువారం ఉదయం 11 గంటలకు లైబ్రరీ ఆడిటోరియం వేదికగా జరిగే కార్యక్రమానికి గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ప్రొటోకాల్ ప్రకారం వివిధ డిపార్ట్‌మెంట్ అధికారుల సహకారంతో ఏర్పాట్లు చేశాం. కార్యక్రమంలో ఎంఎస్‌ఎన్‌రెడ్డి గౌరవ డాక్టరేట్, 83 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 12 మందికి పీహెచ్‌డీ పట్టాలు అందుకోనున్నారు. - జీఎన్ శ్రీనివాస్, వీసీ పీయూ

పారదర్శకంగా ధాన్యం సేకరణ

గద్వాల: ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత స్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఇతర ఉన్నాతాధికారులతో కలిసి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు అదనపు కలెక్టర్లు ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని అన్నారు. జిల్లాల్లో ఈ సారి ఖరీఫ్‌లో 38,748 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేయడం జరిగిందని 276 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. జిల్లాలో అవసరం మేరకు ఐకేపీ-66 పిఎసిఎస్-13 మెప్మా -05 మొత్తం 84 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నవంబర్ 1న ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, నర్సింగరావు, డీఎస్ఓ స్వామికుమార్, సివిల్ సప్‌లైయ్ డీఎం విమల ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


కేతావత్ శివ (ఫైల్)

బిజినేపల్లి: మండలంలోని ఖీమ్యాతండా జీపీ పెద్ద వేములతండాకు చెందిన కేతావత్ శివ (21) పురుగుల మందు తాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దవేములతండాకు చెందిన శివ సోమవారం తండాలో పురుగుల మందు తాగాడు. విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు శివను ఆస్పత్రికి తరలించారు.హైదారాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు.

నీటిగుంతలో పడి వ్యక్తి మృతి


కృష్ణయ్య(ఫైల్)

చిన్నచింతకుంట: మతిస్థిమితంలేని ఓవ్యక్తి నీటిగుంతలో పడి మృతిచెందిన ఘటన కొకుంట్ల మండలం గూడూర్ ఊకచెట్టు వాగు సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. తిర్మలాపురం గ్రామానికి చెందిన దాసరి కృష్ణయ్య(55) కొన్నిరోజులుగా మతిస్థిమితంలేకుండా తిరుగుతున్నాడు. కృష్ణయ్యకు భార్యాపిల్లలు లేకపోవడంతో అక్క చెన్నమ్మతో ఉండేవాడు. రెండు రోజులుగా కనిపించకుండాపోయాడు. బుధవారం తెల్లవారుజామున గూడూర్ ఊకచెట్టు వాగు సమీపంలోని నీటిగుంతలో శవమై తేలాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి కుటుంబ సభ్యులు చేరుకొని మృతదేహాన్ని గ్రామానికి తరలించారు.ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఓబుల్‌రెడ్డి తెలిపారు.

యువకుడి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నల్లవెల్లిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. నల్లవెల్లికి చెందిన నవీన్(21) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం తండ్రి వెంకటయ్య వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి రాగా.. కొడుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనకు సంబంధించి మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఏపీలోని నంద్యాల జిల్లాకు చెందిన దుర్గమ్మ(32) భర్త ఎల్లప్ప జీవనోపాధి నిమిత్తం నాలుగు నెలల క్రితం గద్వాలకు వచ్చారు. బీసీ కాలనీలోని ప్రైవేట్ స్థలంలో గుడిసె ఏర్పాటు చేసుకుని కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం సాయంత్రం నివాసం ఉంటున్న గుడిసెలో టేబుల్ ఫ్యాన్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన భర్త జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై భర్త ఎల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం సమీపంలో శ్రీవారి సముద్రం చెరువు కట్టపై పురుగుల మందు తాగి మహిళ మృతి చెందిన ఘటన చోటోచేసుకుందని ఎస్ఐ హృషికేశ్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌కు చెందిన మొట్టె లక్ష్మి(40) పురుగు మందుతాగి చనిపోయింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఇప్పటికీ ఎలాంటి ఫిర్యాదు అందులేదన్నారు. కుటుంబ కలహాలే మృతికి కారణమని గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి భర్త చంద్రయ్య, ఉన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

కేటీదొడ్డి: గుప్తనిధుల తవ్వకాలు చేపట్టిన ఘటన బుధవారం మండలంలో కలకలం రేపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల కేంద్రం నుంచి గువ్వలదిన్నె రోడ్డు పక్కనున్న ఆంజనేయస్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. గుప్తనిధుల కోసం చేపట్టిన తవ్వకాలు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించారు. దుండగులు చేతకాక మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయినట్లు గమనించారు. ఆలయంలో ఎలాంటి వస్తువులు, విగ్రహాలు ధ్వంసం కాలేదని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పురాతన ఆలయాలపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భక్తులు ఆలయంలో పూజ నిర్వహించడానికి వెళ్లగా.. అక్కడి పరిస్థితిని గమనించి నిధుల కోసం తవ్వకాలు జరిగాయని చుట్టపక్కల గ్రామస్తులకు తెలియజేశారు.



హత్య చేసి.. / రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు

ప్రియుడితో భర్తను చంపించిన భార్య

- వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- మృతుడి తండ్రి ఫిర్యాదుతో అనుమానాస్పద కేసు నమోదు
- భార్య, ఆమె ప్రియుడితో పాటు మరో ఇద్దరి రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహేతర సంబంధానికి అడ్డుగా మారాడని కట్టుకున్న భర్తను ఓ భార్య హత్య చేయించింది. ఆ తర్వాత రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. ఈ ఘటనకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 12న నాగర్‌కర్నూల్ మండలం గుడిపల్లి గ్రామ శివారులో జరిగిన హత్య కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం నాగర్‌కర్నూల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం గ్రామానికి చెందిన మైనగాని రాములు (37) గుడిపల్లి శివారులో ఈ నెల 12న అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే మృతుడు మైనగాని రాములు ఇంట్లో 6 నెలల క్రితం బంగారం చోరీకి గురికాగా.. పెద్దముద్దునూరుకు చెందిన సురేశ్‌గౌడ్ తన మంత్ర శక్తితో కనిపెడతారని కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. ఈ క్రమంలోనే మృతుడి భార్య మానసకు సరేశ్‌గౌడ్‌తో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. మానస, సురేశ్‌గౌడ్ వ్యవహారం ఇంట్లో తెలియడంతో కలహాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే మానస తన భర్తను ఎలాగైనా హత్య చేయించాలని పథకం రచించింది. ఈ నెల 8న తన కుటుంబ సభ్యులతో కలిసి గుడిపల్లికి వెళ్తున్నామని.. నాలుగు రోజులు అక్కడే ఉంటామని సురేశ్‌గౌడ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. అక్కడే తన భర్తను హతమార్చాలని చెప్పింది. ఈ మేరకు రాములును హత్య చేసేందుకు సురేశ్‌గౌడ్ తన వద్ద పనిచేస్తున్న వెన్నచర్ల గ్రామవాసి బాలపీరు, లక్ష్మీతండాకు చెందిన హన్మంతుతో రూ. 2.80 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. ఆ తర్వాత మానసకు ఫోన్‌చేసి రాములును హతమార్చేందుకు ఓ పార్టీ ఉందని.. అతడితో కలిసి పెద్దముద్దునూరుకు రావాలని చెప్పాడు. ఇవేవీ తెలియని రాములు తన భార్యతో కలిసి పెద్దముద్దునూరుకు వెళ్లగా.. అక్కడ మద్యం తాగించారు. అనంతరం నిందితుడు సురేశ్‌గౌడ్ తన కారులో గుడిపల్లి శివారులోని కేఎల్ఐ కాల్వ వద్దకు తీసుకొచ్చి ముక్కు, నోటికి ప్లాస్టర్ వేసి ఊపిరాడకుండా చేసి హతమార్చాడు. అనంతరం రాములు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని అందరినీ నమ్మించేందుకు మృతదేహంతో పాటు మోటారు సైకిల్‌ను రోడ్డుపై వేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించడంతో చేసిన నేరాన్ని ఒప్పుకొన్నారు. హత్యకు పాల్పడిన సురేశ్‌గౌడ్, మానసతో పాటు బాలపీరు, హన్మంతును అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

మహబూబ్‌నగర్ విజయం

- 120 పరుగుల తేడాతో బాలాజీ కోల్ట్స్‌పై గెలుపు


విజయం సాధించిన జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ బి–డివిజన్ టూడేలీగ్ మ్యాచ్‌లో జిల్లా జట్టు 120 పరుగుల తేడాతో బాలాజీ కోల్ట్స్‌పై విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జట్టు మొదటి రోజు 76.5 ఓవర్లలో 238 పరుగులు చేసి ఆలౌట్ అయింది. బుధవారం రెండో రోజు బ్యాటింగ్ చేసిన బాలాజీ కోల్ట్స్ జట్టు పాలమూరు బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 39.3 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్లు ఎండి. ముఖితుద్దీన్ 28 పరుగులకు 3 వికెట్లు, జస్వంత్ 38 పరుగులకు వికెట్లు, మనోజ్ 21 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశారు. జిల్లా జట్టు మ్యాచ్‌లో విజయం సాధించడంపై ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా అభినందించారు. రానున్న మ్యాచుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఉల్లి క్వింటా రూ.1,900



దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధర క్వింటాకు గరిష్ఠగా రూ.1900 వరకు పలికింది. కనిష్ఠంగా 1200 వరకు ధరలు నమోదయ్యాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి ఉల్లి ధరలు అటుఇటుగా నిలకడగానే ఉన్నాయి. సీజన్ ముగిసిన తర్వాత కూడా ధరల్లో మార్పురాలేదు. మార్కెట్‌కు కొత్త ఉల్లి వచ్చినప్పటికీ పాత ఉల్లికి ఇంకా డిమాండ్ తగ్గలేదు. నాణ్యంగా ఉన్న ఉల్లికి గరిష్ఠ ధరలు పలుకగా, రెండో రకం ఉల్లికి కనిష్ఠ ధరలు వచ్చాయి. 50 కేజీల బస్తా ధర గరిష్ఠంగా రూ.950, కనిష్ఠంగా రూ. 600వరకు పలికింది. కొత్త ఉల్లి నాణ్యతగా లేకపోవడంతో కొనేవారు లేక తిరిగి వాపసు తీసుకుపోయారు.

హంస రకం రూ.1,809

దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం మధ్యాహ్నం జరిగిన టెండర్లల్లో హంస ధాన్యం ధర క్వింటాకు గరిష్ఠంగా రూ.1809గా ఒకే ధర లభించింది. మార్కెట్‌కు రెండు వందల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూర్: కుటుంబ కలహాలతో ఓవ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన బుధవారం ఆత్మకూర్ మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. జూరాలకు చెందిన కుర్వ గట్టు ఆంజనేయులు(38) భార్యతో గొడవ పెట్టుకున్నాడు. దీంతో భార్య ఇద్దరు కొడుకులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లింది. ఇది జీర్ణించుకోలేని ఆంజనేయులు బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఆధునిక పద్ధతులు అవలంబించాలి


మాట్లాడుతున్న పాలెం శాస్త్రవేత్త శశిభూషణ్

మహబూబ్‌నగర్ రూరల్: పంటల సాగుకోసం రైతులు ఆధునిక పద్ధతులను అవలంబించాలని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శశిభూషణ్ అన్నారు. బుధవారం మండలంలోని మాచన్‌పల్లి రైతువేదికలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వనపర్తి మహాత్మా జ్యోతిబా పూలే ఉమెన్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటల సాగుకు ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని వ్యవసాయరంగ నిపుణుల సూచనలు, సలహాల మేరకు పంటలను సాగుచేయాలని తెలిపారు. పంటల సాగులో తగిన మెలకువలు పాటించాలని, తక్కువ రసాయనిక ఎరువులు వాడాలన్నారు. పురాతన పనిముట్లను వీడి ఆధునిక పరికరాలతో పంటలు సాగు చేస్తే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి అవగాహన పెంపొందించడానికి ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తుందని, రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకుని పంటల దిగుబడిని పెంచుకొని లాభాలు పొందాలని సూచించారు. అనంతరం ఆధునిక వ్యవసాయ పరికరాల గురించి రైతులకు వ్యవసాయ కళాశాల విద్యార్థినులు అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయమే రైతులకు శ్రీరామ రక్ష అని, దానినుంచి ఉత్పత్తయ్యే అన్నిరకాల ధాన్యాలు ప్రజలకు ఎంతగానో మేలు చేస్తాయని అభిప్రాయ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం సమన్వయకర్తలు అర్చన, కల్యాణి, ఏఓ శృతి, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు

- వాంతులు చేసుకున్న విద్యార్థులు
- మూడు రోజుల నుంచి ఇదే తీరు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు


మధ్యాహ్న భోజనంలో ఉన్న పురుగులు


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ అనిల్‌గౌడ్

మక్తల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడంతో బుధవారం విద్యార్థులు భోజనం చేయకుండా ఇంటికి వెళ్లారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు దాదాపు 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా వండటం లేదని మూడు రోజుల నుంచి ఉపాధ్యాయులు, హెచ్‌ఎంకు చెప్పినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపించారు. గతంలో కలెక్టర్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వంట ఏజెన్సీ మహిళలను ఆదేశించారు. కలెక్టర్ చెప్పినా ఫలితం లేకుండా పోయిందని విద్యార్థులు వాపోతున్నారు. విషయం బయటకు రావడంతో ఏబీవీపీ నాయకులు వినయ్‌తో పాటు మరికొందరు అక్కడికి చేరుకొని పురుగుల అన్నాన్ని పరిశీలించారు. సమస్యను ఎంఈఓ అనిల్‌గౌడ్‌కు వివరించగా.. ఆయన అక్కడికి చేరుకున్నారు. వంటలు సక్రమంగా చేయడం లేదని, నీళ్ల సాంబర్ వడ్డిస్తున్నారని విద్యార్థులు ఎంఈఓ దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన ఎంఈఓ వంట ఏజెన్సీ వారిని వెంటనే తొలగించి, కొత్త వారికి అప్పగించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారంగా మధ్యాహ్న భోజనం అందించాలని, లేకుంటే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు విద్యార్థులు వాంతులు చేసుకున్నప్పటికీ ఉపాధ్యాయులు విషయాన్ని బయటకు రానివ్వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడం లేదని, తూతూమంత్రంగా విధులు నిర్వహిస్తున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. భోజనం వండిన తర్వాత మొదటగా హెచ్‌ఎం పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని కలెక్టర్ ఆదేశించినా బేఖాతరు చేస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు ఎన్నోసార్లు జరిగాయని, బియ్యంలో పురుగులను సక్రమంగా తీయడం లేదని తెలిపారు. గోదాం నుంచి పాత బియ్యం తెచ్చారా.. లేక పాఠశాలలో మక్కిన బియ్యంతో అన్నం వండారా అని విషయంపై దర్యాప్తు చేస్తున్నామని ఎంఈఓ తెలిపారు.

కప్ప ఉందని వదంతులు

చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులక వడ్డించే మధ్యాహ్నం భోజనంలో కప్ప కనిపించిందని వదంతులు వచ్చాయి. నిత్యం పాఠశాలకు అక్షయ పాత్ర ద్వారా 270మంది విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందుతుంది. బుధవారం పాఠశాలలో సిబ్బంది విద్యార్థులకు భోజనం వడ్డిస్తుండగా.. ఓ విద్యార్థి అన్నం పెట్టుకొని పప్పు వేసుకోగానే కప్ప కనిపించిందని.. విద్యార్థులు, ఉపాధ్యాయులు భోజనాన్ని పార బోసినట్లు సమాచారం. అనంతరం విద్యార్థులు తమ ఇళ్లలోకి వెళ్లి భోజనం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై హెచ్‌ఎం, ఎంఈఓ మురళికృష్ణను వివరణ కోరగా.. కప్ప ఉందన్న పుకార్లు మాత్రం ఉన్నాయన్నారు. కప్ప కనిపించిన ఆధారాలు ఎక్క డాలేవని తెలిపారు. ప్రస్తుతం చిన్నచింతకుంటలో సమావేశంలో ఉన్నందున పాఠశాలకు అందుబాటులో లేనన్నారు. పూర్తి సమాచారం తెలుసుకొని విచారణ చేపట్టనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

నేడు నల్లమలలో ట్రాఫిక్ ఆంక్షలు


ఈగలపెంట జెన్‌కో గ్రౌండ్‌లో ఆగిన వాహనాలు, ఆర్టీసీ బస్సులు

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్
- ప్రదాని మోదీ శ్రీశైలం పర్యటనలో బందోబస్తు
- ఈగలపెంట జెన్‌కో గ్రౌండ్‌లోకి వాహనాల మళ్లింపు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 16న గురువారం శ్రీశైలం పర్యటన నేపథ్యంలో నల్లమల అటవీప్రాంతంలో ట్రాఫి క్ ఆంక్షలు ఉండనున్నట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రధాని శ్రీశైలం క్షేత్రాన్ని సందర్శించనున్నందున కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని, హైదరాబాద్ నుంచి వీఐపీలు శ్రీశైల క్షేత్రం వెళ్లే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశాలు ఉంటాయని తెలిపారు. నల్లమల అటవీ ప్రాంతం నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ప్రధాని పర్యటన ముగిసిన తర్వాత సందర్శించాలని తెలిపారు. భక్తులు, ప్రయాణికులు పోలీసు శాఖకు సహకరించాలని తెలిపారు.

శ్రీశైలం రాకపోకలు నిలిపివేత

మన్ననూర్: మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుంటున్న సందర్భంగా 16వ తదీ(గురువారం) శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్ నుంచి తాత్కాలికంగా రాకపోకలు నిలిపివేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. శాంతిభద్రతల దృష్ట్యా ఈ రకమైన ట్రాఫిక్ ఆంక్షలు గురువారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఉంటాయన్నారు.

ఎన్ఎస్‌జీ పర్యవేక్షణలో ఏపీ పోలీసులు

దోమలపెంట: శ్రీశైలంలో గురువారం ప్రధానమంత్రి పర్యటన పురస్కరించుకుని ఒక్కరోజు ముందుగానే నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ అధికారుల పర్యవేక్షణలో బుధవారం ఈగలపెంటలో ఏపీ పోలీసులు బందోబస్తు విధుల్లో నిమగ్నమయ్యారు. ఎన్ఎస్‌జీ ఆదేశాల మేరకు విజయవాడ డీఎస్పీ వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతం నుంచి శ్రీశైలంకు వస్తున్న వాహనాలు, ఆర్టీసీ బస్సులను ఈగలపెంటలో ఉన్న జెన్‌కో గ్రౌండ్‌లోకి మళ్లించి అక్కడే వాహనాలను నిలిపి వేయిస్తున్నారు. శ్రీశైలంలో ఉన్న ఎన్ఎస్‌జీ అధికారులు తెలిపినప్పుడు మాత్రమే ఈ వాహనాలను అనుమతిస్తున్నారు. అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. సమాచారం తెలియకుండా విచ్చేస్తున్న పర్యాటకులు, భక్తులు కొంత ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. కాగా ఈగలపెంట, దోమలపెంట ప్రాంతాల్లో హోటల్స్ తెరిచి ఉండడంతో భోజనాలు, టిఫిన్లు తాగునీటికి ఇబ్బందులు లేవు. ఈగలపెంట దాటితే ఒక్క హోటల్ కాని ఇతరత్రా షాపులన్నీ మూసిఉంచారు.

‘సీసీఫుటేజీని అందజేయాలని హైకోర్టు ఆదేశం’

కొల్లాపూర్: కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన సీసీఫుటేజీని తమకు అందజేయాలని జిల్లా పోలీసు అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా.. కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన చిరుముని బాలరాజుయాదవ్ వ్యక్తిగతంగా సెప్టెంబర్ 17వ తేదీన కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. గ్రామానికి సంబంధించిన ఓ అంశంపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. స్టేషన్‌లో ఎస్ఐ హృషికేశ్‌తో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు విచక్షణారహితంగా కొట్టారని, థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాలరాజుయాదవ్ ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగా తనను కొట్టారని ఆరోపిస్తూ ఎస్పీ, ఐజీ, డీజీపీ, రాష్ట్ర హోం సెక్రటరీని సంప్రదించారు. ఎస్ఐ, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. వారినుంచి సరైన స్పందన రాకపోవడంతో బాలరాజు హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫున న్యాయవాదులు కర్నాటి వెంకటరెడ్డి, మహేశ్ మామిండ్ల హైకోర్టులో వాదనలు వినిపించడంతో సెప్టెంబర్ 17వ తేదీన కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన సీసీఫుటేజీని హైకోర్టుకు అందజేయాలని న్యాయమూర్తులు ఎస్పీని ఆదేశించారని బాలరాజుయాదవ్ తెలిపారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై ఎస్ఐ హృషికేశ్‌ను వివరణ కోరగా.. ఈ కేసులో హైకోర్టుకు హాజరయ్యామని, సీసీ ఫుటేజీకి సంబంధించిన ఆదేశాలు ఏవీ తనకు తెలియదని తెలిపారు.

ప్రతి ఒక్కరూ హస్తకళల్లో నైపుణ్యం సాధించాలి

- టీజీ హస్తకళ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువర్చల



మాట్లాడుతున్న టీజీ హస్తకళ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువర్చల

బల్మూర్: ప్రకృతిలో లభించే మట్టి, చెట్లు, రాళ్లతో అనేక రకాల వస్తువులు తయారు చేసే హస్త కళాకారుల నైపుణ్యతను ప్రోత్సహించాలని తెలంగాణ హస్తకళల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువర్చల సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్రం తెలంగాణ హస్తకళల డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో మూడురోజుల అవగాహన, వర్క్‌షాప్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు హస్తకళలతో నేర్చుకోవాలని సూచించారు. హస్తకళలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ చాటుతున్న యువతి, యువకులను గుర్తించి వారికి చేతి వృత్తులపై అవగాహన కల్పించి గుర్తింపుకార్డులతోపాటు ఉపాధి కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సహకరిస్తామన్నారు. ప్రతిఒక్కరూ హస్తకళలపై అభిరుచి పెంచుకోవాలని కోరారు. దేశంలో హస్తకళలకు ఉన్న గుర్తింపుతో భవిష్యత్‌లో ఈ రంగంలో రాణిస్తే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని సూచించారు. మూడురోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో క్రోచ్ వర్క్, హాండ్ ఎంబ్రాయిండరీ, వెదురు పనిముట్లపై వర్క్‌షాప్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు నిమ్మలపద్మ, వెంకటమ్మ, మౌనిక, శ్రీబిఫిన్‌పాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూరాలకు 24,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


- నాలుగు యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి
- ప్రాజెక్టు నుంచి 26, 306 క్యూసెక్కులు దిగువకు విడుదల

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 24, 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 36వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం రాత్రి 8:30 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 24, 600 క్యూసెక్కులకు తగ్గినట్లు అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 10 యూనిట్లను కొనసాగించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 23, 106 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 70క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 700 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 26, 306 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.512 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో 883.3 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం నీటిమట్టం 883.3 అడుగుల వద్ద 206.0996 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 22,284, సుంకేసుల నుంచి 2,280 మొత్తం 24,564 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. శ్రీశైలంలో భూగర్భకేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 27,112 మొత్తం 62,427 క్యూసెక్కుల నీటిని దిగువున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 8,000, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,814, ఎంజీకేఎల్ఐకి 1,437 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భకేంద్రంలో 17.056 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 14.519 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

దీపావళికైనా వేతనాలు ఇవ్వండి


కార్మికులతో మాట్లాడుతున్న సురేశ్

జడ్చర్ల టౌన్: ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు దసరా పండగకు ఎలాగూ వేతనాలు ఇవ్వలేదు.. కనీసం దీపావళికైనా ఇవ్వండంటూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. బుధవారం జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. దసరా పండగకు ముందే నాలుగు నెలల వేతన బడ్జెట్ విడుదలైనప్పటికి శ్రీశాంతి ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఇప్పటికీ వేతనాలు అందడంలేదని ఆరోపించారు. గత శుక్రవారం చేసిన మెరుపు సమ్మెకు ఆస్పత్రి సూపరింటెండెంట్ దిగివచ్చి ఐదురోజుల్లో వేతనాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరో మూడు రోజుల్లో దీపావళి పండగ వస్తుందని, అందరి జీవితాల్లో వెలుగులున్నా.. ఆస్పత్రి కార్మికుల జీవితాల్లో చీకట్లు అలుముకున్నాయన్నారు. వెంటనే ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకుని వేతనాలు ఇచ్చేలా చూడాలన్నారు. లేదంటే నిరవధిక సమ్మెకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి యూనియన్ అధ్యక్షుడు నర్సింహులు, కార్మికులు నవీన్, శేఖర్, రవీందర్, రామకృష్ణ, విజయలక్ష్మి, మనెమ్మ, శివలీల, పద్మ, సుక్కమ్మ, అలివేల, భార్గవి, నీరజ, అంజలి, నర్సమ్మ, స్వామి, భాగ్యమ్మ పాల్గొన్నారు.